క్లుప్తంగా

నేడు జాతర తైబజార్, టెంకాయల వేలం

లింగాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ నెలలో జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 24న జాతర తైబజార్, కొబ్బరి కాయల వేలం నిర్వహిస్తున్నట్లు రామాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పూజారి భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే వే లంలో ఆసక్తి గల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కు రూ.60వేలు నిరంజన్‌కు, రూ.40 వేలు బాలయ్యకు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నరసింహులు అందజేశారు.

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కోర్రెడ్డి సంధ్య గతంలో అనారోగ్యంతో బాధడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.24 వేల చెక్కును నాయకులు రాములు యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఫొటోగ్రాఫర్ల నూతన కమిటీ ఏకగ్రీవం

లింగాల: నియోజకవర్గం ఫొటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో మండల ఫొటో గ్రాఫర్ల నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా మెరుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మోర గణేష్, కోశాధికారిగా ఎండీ.సుల్తాన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి గిరి, సీనియర్ ఫొటో గ్రాఫర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జేపీ నగర్ వద్ద అనుమతి లేకుండా నడుస్తున్న లారీతో పాటుగా రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున వంగూర్ మండలం డిండి చింతపల్లి మండలం నుంచి కల్వకుర్తి వైపు ఇసుక లోడ్‌తో లారీ, ట్రాక్టర్లు వస్తున్నాయి. వాటిని పోలీసులు తనిఖీ చేసి అనుమతి పత్రాలు కోరారు. లేకపోవడంతో వాటిని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

108 వాహనం తనిఖీ



తెలకపల్లి: 108 వాహనాన్ని ఆదివారం సాయంత్రం జిల్లా అధికారి తనిఖీ చేశారు. ఈఎంఆర్ గ్రీన్‌హెల్త్ సర్వీస్ అధికారి పకీర్‌దాస్ వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో మెడిసిన్, ఇతర పనిముట్ల తీరును ఆయన పరిశీలించారు. ఈ అత్యవసర సేవలను మరింత మెరుగ్గా అందించాలని 108 సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, 108 సిబ్బంది ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ కురుమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



వెల్దండ: మండలంలోని కేస్లీతండా, కుందారం తండా, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రజలు వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా అడవిలోకి వెళ్లి వంటావార్పు చేసి వనదేతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



లింగాల: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సిరాజ్‌ఖాన్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఓపెన్ హార్ట్ సర్జరీ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు స్పందించారు. మిత్రులు అందరు కలిసి జమ చేసిన రూ. 58 వేలు ఆదివారం సిరాజ్‌కు అందజేశారు. మిత్రునికి అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు.

సమస్యల్లో వారాంతపు సంత



లింగాల సంతలో కూరగాయలు, ఇతర సరుకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- సంతలో తాగునీటికి కటకట
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- బస్సులు వెళ్లేందుకు ఇబ్బంది

లింగాల: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం కొనసాగే వారాంతపు సంతలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రైతుబజార్ ప్రదేశంలో నిర్వహిస్తున్న సంత కిక్కిరిసి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంతకు మండలంలోని దాదాపుగా 20 గ్రామాల ప్రజలు కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల కొనుగోలుకు వస్తుంటారు. ప్రజలకు, వ్యాపారులకు కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో సమస్యలు తీవ్రంగా మారుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి సంతకు వచ్చే ప్రజలకు కనీసం తాగటానికి నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇ బ్బందులు పడుతున్నారు. పెద్దకొత్తపల్లి, బల్మూర్, తెల్కపల్లి, నాగర్‌కర్నూల్, వనపర్తి, బిజినేపల్లి తదితర ప్రాంతాల నుంచి అమ్మకందారులు వస్తుండడంతో వారికి మంచినీటి వసతి కల్పించడంలో గ్రామ పంచాయతీ వారు శ్రద్ధ చూపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి సంతకు పంచాయతీకి తైబజార్ రూపంలో డబ్బులు చెల్లిస్తున్నా సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పార్కింగ్ లేక పోవడంతో రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

వాహనాల పార్కింగ్‌కు అవస్థలు

సంత రోజు వందలాది ద్విచక్ర వాహనాలలో ప్రజలు వస్తుంటారు. వాహనాలను పాత బస్టాండ్, బొడ్రాయి పరిసర ప్రాంతాలలో అడ్డదిడ్డంగా నిలుపుదల చేస్తుండడంతో బస్సులను మలిపేందుకు డ్రైవర్లు తంటాలు పడుతున్నారు. వాహనాల నిలుపుదలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం లేక పోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో వాహనాలను రోడ్లపై నిలుపుదల చేయడంతో పోలీసులు చలాన్లు రాస్తున్నారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం



వారాంతపు సంతలో ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేయకుండా వ్యాపారులను అప్రమత్తం చేస్తున్నాం. వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంచాయతీ వారు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– నాగరాజు, ఎస్‌ఐ లింగాల

సాగు భూములకు హక్కులు కల్పించాలి



ఎంపీ మల్లు రవిని కలిసిన మాజీ చైర్మన్ మల్లికార్జున శర్మ, గిరిజన నాయకులు

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో అగ్రహారం తండా, గైరాన్ తండాకు చెందిన గిరిజనులు రెండు తరాలుగా స్వామివారికి సేవలు చేస్తూ, స్వామివారి అడవులను కొట్టుకుంటూ సాగు చేసుకున్న భూములకు హక్కు కల్పించాలని గిరిజన సంఘం మండల నాయకులు సరిరాం నాయక్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి నివాసంలో ఆయనను కలిసి గిరిజనులు సాగుచేస్తున్న భూములపై హక్కులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ నాయక్, శ్రీను నాయక్, రామ్‌లాల్ నాయక్, రవి నాయక్, శివ నాయక్ తదితరులు ఉన్నారు.

ఎంపీ మల్లురవికి వినతి

మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయ మాజీ చైర్మన్ ధేరం మల్లికార్జునశర్మ ఎంపీ మల్లు రవికి కలిసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు.

కిటకిలాడిన మైసమ్మ జాతర



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలలో 15వేల మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుల తీర్చుకున్నారు. గద్వాల, వనపర్తి, పెబ్బేరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

వరిపైరుకు కొంగర తెగులు



కొంగర తెగులు సోకిన వరికంకి

పెద్దకొత్తపల్లి: రబీలో రైతులు సాగు చేస్తున్న వరి పైరుకు కొంగర తెగులు ఆశించండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉన్నది. కొంగర తెగులు ఆశించి వరిగింజలు పట్టకుండా తెల్లగా కంకులు మారిపోయి రైతులకు బారి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. మండలంలో రబీలో కేఎల్ఐ నీళ్లు రావడంతో 8,144 ఎకరాలలో వరిసాగు చేశారు. రైతులు కొంగర తెగులు నివారణ కోసం కాంటాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు మందును ఎకరాకు పిచికారీ చేసుకుంటే కొంగర తెగులును నివారించుకోవచ్చని పెద్దకొత్తపల్లి ఏఈఓ ముజీబ్ తెలిపారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా నుంచి అథ్లెటిక్స్ పోటీల్లో పతకం సాధించిన కందనూలు జిల్లా క్రీడాకారులను ఆదివారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎం విజేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త శ్రీరాములు, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఘనంగా భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు నివాళి
- పట్టణాల్లో, గ్రామాల్లో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు
- జిల్లా కేంద్రంలో రక్తదానం చేసిన యువకులు

సాక్షి, నెట్‌వర్క్: దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసి భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సేవా భారతి జిల్లా అధ్యక్షులు ఆకుతోట సాయిబాబు అన్నారు. ఆదివారం జిల్లాలో యువత, ప్రజలు వారి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో సుభాష్‌యూత్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈదమ్మ గుడి కాలనీ యువకులు 50 మందికి పైగా రక్తదానం చేశారు.

- భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు.
- కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర సంక్షేమ వసతిగృహంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు బీఆర్ఎస్‌వీ, ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- చారకొండ మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు.
- కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బల్మూర్ మండలంలోని కొండనాగుల, బల్మూర్ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు.
- తాడూరు మండల కేంద్రం, గుంతకోడూరు, అంతారం, ఐతోల్ గ్రామాల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- పెద్దకొత్తపల్లి, కల్వకోల్‌లో అవోపా ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.
- ఉప్పునుంతల, కాంసానిపల్లి గ్రామాల్లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



కల్వకోల్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళుల ర్పిస్తున్న అవోపా సభ్యులు



జిల్లా కేంద్రంలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



నాగర్‌కర్నూల్‌లో రక్తదానం చేస్తున్న యువకులు



కల్వకుర్తిలో..




బల్మూర్‌లో..

'మా భూమి రథయాత్ర'ను విజయవంతం చేయాలి

చారకొండ: ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారధన్ మహరాజ్ బహుజనుల రాజ్యస్థాపనకు చేపట్టే లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చారకొండ చంద్రశేఖర్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ నుంచి లక్ష కి.మీ. మా భూమి రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మల్లేష్, నాయకులు మల్లేష్, మొగులయ్య, మహేష్, వెంకటయ్య, శివ, విజయ్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు వరం రాజీవ్ యువ వికాసం



కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలోని యువత కోసం ప్రభు త్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం నిరుద్యోగ యువతకు వరం అని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ నిజాముద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.6 వేల కో ట్లతో రాష్ట్రంలోని అర్హులైన నిరుద్యోగ యువకులకు రూ.4 లక్షల వరకు రుణం ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కు చెందిన ఐదు లక్షల మంది నిరుద్యోగులు ఈ ప థకంలో లబ్ధి పొందుతారని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నిరుద్యోగ యువత వెంటనే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నిజాముద్దీన్ కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం లభించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం ప్రకటించారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ చౌరస్తాల్లో వారు సంబరాలు నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో మంద నర్సింహ్మ మాదిగ, కొండూరు రాములు, శీలం అగ్రస్వామి, నాగులపల్లి లక్ష్మయ్య, రాము, తదితరులున్నారు.

కార్గో సర్వీస్ ద్వారా కల్యాణ తలంబ్రాలు

తెలకపల్లి: తెలంగాణ ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో సర్వీస్ ద్వారా భద్రాచలం సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు హిందు ధార్మిక సంఘాల నాయకులు బుక్ చేసుకున్నారు. హిందు ధార్మిక సంస్థల వారు కార్గో సెంటర్ ద్వారా భద్రాద్రి సీతారామచంద్రస్వామి తలంబ్రాలను సామూహికంగా పాల్గొని బుక్ చేసుకున్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఉమాపతి, చంద్రమౌళి నరేంద్రచారి, అనిల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం కోడేరు మండలం బాడిగదిన్నెలో పర్యటించి సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కొక్కటిగా నెరవేర్చుతోందని అన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందుతాయన్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అభివృద్ధి ని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణ లు చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, బాలపీరు, అశోక్, కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

కొల్లాపూర్: పట్టణంలోని రజక వీధికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిన్న మహంకాళి(65) అనారోగ్యంతో మరణించారు. నెల రోజుల క్రితం ఆయన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం కొల్లాపూర్‌లో బాధిత కుటుంబాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. మంత్రి వెంట నాయకులు సన్నీ, నర్సింహారావు, నాగరాజు, పసుపుల నర్సింహ, డాక్టర్ రాముడు, పరశురాముడు, కేతూరి ధర్మతేజ ఉన్నారు.

రంజాన్ మతసామరస్యాన్ని పెంపొందిస్తుంది



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్ కర్నూల్: పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు నిష్ఠతో కఠిన ఉపవాసాన్ని ఆచరిస్తారని, ఈ రంజాన్ మాసం సమాజంలో సామరస్యాన్ని, సంతోషాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొదిస్తుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ తీగల సునీంద్ర ఆధ్వర్యంలో తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్లో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరై మాట్లాడారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి విచ్చేసిన ముస్లింలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వారి సంక్షేమం కోసం తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

నియోజకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నియోజకవర్గ బ్రాహ్మణులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీలను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణంలోని పేద బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, నాగర్ కర్నూల్ పట్టణంలో బ్రాహ్మణ భవన్‌కు స్థలం కేటాయించి భవనం కట్టించాలని కోరారు. బ్రాహ్మణ సంఘం నాయకులు దుర్గి శ్రీకాంత్ శర్మ, నర్వ దిలీప్ కుమార్, వెల్దండ ప్రదీప్ కుమార్, వినోదాచార్యులు, సంతోష్ శర్మ, పవన్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



మసీద్‌లో ప్రార్థన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్ననూర్/బల్మూర్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని శివాలయం, మసీద్‌లో నాయకులు, అభిమానులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆరోగ్యం బాగుండాలని, త్వరగా ప్రజల్లోకి రావాలని దేవతలకు పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కర్నాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ అలివేల, నాయకులు సాదిక్, శ్రీనివాసులుల, ప్రభాకర్, ఉమస్, జహంగీర్, బురాన్, కరీం, మల్లేష్ పాల్గొన్నారు.

- బల్మూర్ మండలంలోని జినుకుంట కనకాల మైసమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో శివగౌడ్, కృష్ణయ్య, ఎల్లికంటి శ్రీనువాసులు, సంపంగి రమేష్, శ్రీనువాస్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

బల్మూర్: మండలానికి 2024–25 సంవత్సరానికి కేటాయించిన వ్యవసాయ యంత్రీకరణ(ఎస్ఎంఏఎం) పనిముట్ల కోసం అర్హులైన మహిళా రైతులు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నరేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలానికి మంజూరైన యూనిట్లలో బ్యాటరీ స్ప్రేయర్ ఎస్సీ కేటగిరికి -5, పవర్ నాప్సానక్ స్ప్రేయర్/పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు–5, రోటవేటర్స్–2, డిస్క్ హారో/కల్టీవేటర్/కేజ్ వీల్స్ రోటో పడిస్క్–3 చొప్పున ఉన్నాయని ఆయన తెలిపారు. 50 శాతం రాయితీపై అందించే ఈపని ముట్ల కోసం 2 ఎకరాల 20 గుంటల భూమి కలిగిన మహిళా రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇందు కోసం భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీలతో దరఖాస్తులను ఏఈఓలను అందజేయాలని ఆయన తెలిపారు.

మృతదేహం లభ్యం

బిజినేపల్లి: మండలంలోని కారుకొండ సమీపంలో ఉన్న కేఎల్ఐ కాల్వలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైందని గ్రామస్తులు తెలిపారు. అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి బయటకు తీశారు.

పంచాంగ పుస్తకాల ఆవిష్కరణ



పంచాంగ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అర్చకులు

తెలకపల్లి: ఆదివారం మండల కేంద్రమైన తెలకపల్లిలోని శ్రీ త్రిముఖ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో భాగ్యనగర వాస్తవులు బ్రహ్మశ్రీ రాళ్లబండి లంకేశ్వర సిద్ధాంతి ఘణించిన విశ్వావసు నామ సంవత్సర సూర్యసిద్ధాంత విశ్వకర్మ పంచాంగాన్ని పూరోహితుల సమక్షంలో ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ మరోజు ఉమాపతి ఆచార్యుల ఆవిష్కరించారు. ఆ ప్రతులను పురోహితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పురోహితులు రామచార్యులు, ఉమాపతిఆచార్యులు, శ్రీనివాస చార్యులు, రాఘవేంద్ర, యాదయ్య, వెంకటాచారి, తదితరతులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో వడగండ్ల వాన



చేగుంటలో వర్షానికి రోడ్డుపై పడిన చెట్టు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో ఆదివారం వడగండ్ల వాన కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నది. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చిన్నపాటి చినుకులతో ప్రారంభమైన వర్షం దాదాపు 20 నిమిషాల పాటు వడగండ్ల వాన కురిసింది. వర్షానికి తట్టుకోలేక పలువురు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు హోటళ్లు, దుకాణాలు, షెడ్లలోకి పరుగులు పెట్టారు. తిమ్మాజిపేటతో పాటు చుట్టు పక్క గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పత్తి, మిరప పంటలు దాదాపు పూర్తి కావడం, వరి పంటలు పొట్ట దశలో ఉండడంతో రైతులకు ఊరటనిచ్చినట్లైంది. ఉగాది పండుగ ముందు వర్షం కురవడం సాధారణమేనని పలువురు రైతులు పేర్కొన్నారు.